ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 చిత్తూరు జిల్లా వార్తలు

ఆదివారం 31 మార్చి 2024





తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ ట్రైసిటీగా అభివృద్ధి చేయాలన్నది తన కల అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లో జరిగిన ప్రజాగళం సభల్లో ప్రసంగిస్తూ తిరుపతి జిల్లా అభివృద్ధికి తాను చేయదలచుకున్న అనేక అంశాలను ప్రజలకు తెలియజేశారు. టీడీపీ పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులనూ, జగన్ చేసిన విధ్వంసాన్నీ వివరించారు. వెల్లువెత్తినట్టుగా హాజరైన ప్రజలను చూసి చంద్రబాబు ఉత్సాహంగా ఉద్వేగంగా ప్రసంగించారు. సీఎం జగన్ మొదలుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలపై ఆరోపణలు, హెచ్చరికలతో చంద్రబాబు రౌద్రావతారం దాల్చారు.

- శ్రీకాళహస్తి, నాయుడు పేట







జనసేన నేత వినుత, బీజేపీ నేత కోలా ఆనంద్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, వరప్రసాద్‌తో కలిసి సంఘీభావం తెలుపుతున్న చంద్రబాబు

### మధుకు ఓటేస్తే మీ ఇళ్లు కూడా మిగల్చడు

"శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మళ్లీ ఓటేస్తే మీ ఇళ్లూ, భూములూ మిగలవు. నేను తెచ్చిన పరిశ్రమలను ఆయన ఏటీఎంగా మార్చుకుంటున్నాడు. ల్యాంకోను వేధించి కప్పం కట్టలేదని పదిహేను రోజులు మూతబడేలా చేశాడు. మధుసూదన్‌రెడ్డి లాంటి దుర్మార్గుడ్ని నేనెక్కడా చూడలేదు. 210 ఎకరాల ప్రభుత్వ భూములు కాజేశాడు. ఎమ్మెల్యే కుటుంబంలో కూతురు, బావమరిది, కొడుకు, తమ్ముడు నియోజకవర్గాన్ని ముక్కలు చేసుకుని వాటాలు వేసుకుని పంచుకు తింటున్నారు. వీరి అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులను జైలుకు పంపుతాం. అవినీతికి పాల్పడిన వారికి బేడీలు వేసి ఊరేగిస్తాం."

## తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ

# ట్రైసిటీ

- పర్యాటక హబ్‌గా కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తి
- శ్రీకాళహస్తి, నాయుడుపేట సభల్లో చంద్రబాబు ప్రకటన
- వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పి హెచ్చరికలు

### తిరుపతి కేంద్రంగా పిలిగ్రిమ్ హబ్

కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తిలను కలుపుతూ పిలిగ్రిమ్ హబ్‌గా మారుస్తానని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంలో తాను జిల్లాలో రూ. వందల కోట్లు ఖర్చు చేసి ఇరిగేషన్ ప్రాజెక్టులు అభివృద్ధి చేశానని, అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన సైకో జగన్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సోమశిల-స్వర్ణముఖి కెనాల్, గాలేరు నగరి పనులు తాము ప్రారంభించామని, జగన్ పూర్తిగా గాలికొదిలేశాడని అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఎస్ఎస్ కెనాల్ పనులు పూర్తిచేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీటిని అందించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### ఉన్న పరిశ్రమలూ తరిమేశారు

'నేను రేణిగుంట విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తెచ్చాను. ఈ ప్రాంతానికి హీరో మోటర్స్, సెల్‌కాన్, ఈసీఎల్, కార్బన్, డిక్సన్ కంపెనీలు తీసుకొచ్చి పారిశ్రామిక హబ్‌గా మార్చాను. వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న వాటినీ తరిమేస్తున్నారు' అని ఆరోపించారు. రిలయన్స్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోగా, అమరరాజా పరిశ్రమ విస్తరణ ప్లాంటును తెలంగాణకు తరలించడాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### గోపాల్ జ్ఞాపకాలు..

నిజాయితీతో కూడిన రాజకీయాలకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నిలువెత్తు నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. తనకూ గోపాలకృష్ణారెడ్డికి 40 ఏళ్ల స్నేహం వుందన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తామిద్దరూ కలసి వెళుతుంటే అలిపిరి వద్ద తీవ్రవాదులు క్లైమోర్ మైన్స్ పేల్చిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తమ అవసరం ప్రజలకు వుందని భావించడం వల్లే వేంకటేశ్వరస్వామి తమను కాపాడాడన్నారు. శ్రీకాళహస్తి ప్రజల గుండెల్లో గోపాలకృష్ణారెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

### పెద్దిరెడ్డి బినామీ కిలివేటి

"సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంత్రి పెద్దిరెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నాడు. స్వర్ణముఖి, కాళంగి నదుల్లో ఇసుక తవ్వకాలకు మంత్రి పెద్దిరెడ్డి ఎమ్మెల్యేని పావుగా వాడుకుంటున్నాడు. సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని గంజాయి, లిక్కర్, బెట్టింగ్, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమ దందాలకు కేరాఫ్‌గా మార్చేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కనీసం తట్ట మట్టి కూడా పోయలేదు. ఏమి చేశారని ప్రజలు మూడోసారి ఓట్లు వేస్తారు?"


"ఎస్సీ, మైనారిటీ ఎమ్మెల్యేలకు టికెట్లు మార్చిన జగన్, తన సామాజికవర్గానికి చెందిన పెద్దిరెడ్డికి ఎందుకు మార్చలేదు? చెవిరెడ్డికి ఎంపీ టికెట్, కొడుక్కు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి డబుల్ ప్రమోషన్ మాత్రం ఎలా ఇచ్చాడు?"

"సీఎంగా వున్నపుడు ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాను. ఇపుడు వైసీపీలో ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు."

## తప్పుడు ప్రమాణాలు చేస్తే

# దేవుడు క్షమించడు!

- అక్రమాల్లో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫస్ట్
- ఆయనకు ఓటేస్తే సామాన్య ప్రజల బతుకు బుగ్గే
- కర్ణాటకకు చెందిన జనార్దన్‌నాయుడి ఆరోపణ



పలమనేరు ఎమ్మెల్యే మోసం చేశాడని ఆధారాలను చూపుతున్న జనార్దన్‌నాయుడు

శాంతిపురం, మార్చి 30: తాను నీతిమంతుడినని.. అక్రమాలకు పాల్పడలేదని.. పలమనేరు వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం శివాలయంలో ప్రమాణం చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని కర్ణాటకకు చెందిన జనార్దన్‌నాయుడు విమర్శించారు. ఎమ్మెల్యే అక్రమాల్లో ఫస్ట్ అని, తనను కూడా మోసం చేశాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి తప్పుడు ప్రమాణాలు చేస్తే దేవుడు కూడా క్షమించడన్నారు. శనివారం శాంతిపురం మండల సచివాలయం ఆవరణలో మీడియాతో మాట్లాడారు. అయన మాటల్లోనే.. '2020 జనవరి 18వ తేదీన శ్రీవెంకటేశ్వర స్టోన్ క్రషింగ్ ఫ్యాక్టరీతో పాటు అందులోని యంత్రాలు, టిప్పర్లను దౌర్జన్యంగా లాక్కొని ఈ రోజుకు కూడా అక్రమంగా సంపాదిస్తున్నది నిజం కాదా? కోవిడ్ సమయంలో కూడా నా పేరుతో ఉన్న వాహనాలకు ఎలాంటి ఆధారాలు లేకుండా నడుపుతుంటే 2022 ఏప్రిల్ 5న అప్పటి ఏడీ ఇచ్చిన సమాచారంతో నేను శ్రీవెంకటేశ్వర స్టోన్ క్రషింగ్ ఫ్యాక్టరీకి వెళ్లి అడ్డుకుంటే అదే రోజున పోలీసులను పంపి నన్ను బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరించారు. రెండు గంటల తర్వాత అక్కడికి నువ్వు(ఎమ్మెల్యే) వచ్చి.. మధ్యవర్తి కృష్ణమూర్తి ద్వారా రాయబారం చేసింది నిజం కాదా? దీనిపైన గుడిలో సత్యం చేయగలవా? నీ మధ్యవర్తులైన బాలాజీనాయుడు, రెడ్డెప్ప, కృష్ణమూర్తి ద్వారా పంచాయితీ చేసి.. ఇచ్చింది తీసుకుని ఫ్యాక్టరీని వదిలేయాలని బెదిరించింది నిజం కాదా? తర్వాత పైస్థాయి నుంచి బెదిరించి.. వాహనాలకు సంబంధించి సెటిల్‌మెంట్ చేసి.. నీ పేరు మీదైతే ఇబ్బందులు ఉంటాయని చెప్పి.. నీ బినామీ అయిన నీ బావమరిది దయానంద గౌడు పేరు మీద రూ.1.48 కోట్లకు అగ్రిమెంట్ చేసింది నిజం కాదని చెప్పగలవా? తర్వాత పది లక్షల డబ్బులిచ్చి ఐదు లక్షలకు చెక్ ఇచ్చింది నిజం కాదా? ఆ చెక్ పని చేయకుంటే బ్యాంకు ద్వారా ఆర్టీజీఎస్ చేసి డబ్బులు ఇచ్చింది నిజం కాదా? అలాగే నీకు సంబంధించిన చెందిన ఎస్ఎల్వీ కన్‌స్ట్రక్షన్ పేరు మీద కర్ణాటక రాష్ట్రంలోని ఐడీబీఐ బ్యాంకు ఖాతాకు సంబంధించిన రూ.37లక్షలకు చెక్ ఇవ్వగా అది బౌన్స్ అయింది. ఈకేసులో కేజీఎఫ్ కోర్టుకు వచ్చి బెయిల్ ద్వారా బయట తిరుగుతున్నది నిజం కాదా? క్రషింగ్ ఫ్యాక్టరీకి సంబంధించిన కరెంటు బిల్లు రూ.42లక్షలు అప్పు ఉన్నది నిజం కాదా? మీరు ఏది చేసినా వాటన్నింటికీ నా దగ్గర ఆధారాలు ఉన్నాయి' అని వెంకటేగౌడపై జనార్దన్ నాయుడు మండిపడ్డారు. 'ఎమ్మెల్యే నన్ను ఎంత బెదిరించాడో, ఎంత ఏడిపించాడో, పోలీసులు, గూండాల ద్వారా ఎంత హింస పెట్టాడో ఆయన చుట్టూ ఉండే నాయకులకు తెలుసు. ఇలాంటి వ్యక్తికి ఓట్లు వేసి గెలిపిస్తే దాడులు, అక్రమాలు పెరగడమే కాకుండా సామాన్య ప్రజల బతుకు బుగ్గి పాలు కావడం ఖాయం. ఎమ్మెల్యే అక్రమాలపైన కోర్టుకు వెళ్లాం. నా తరపున సీబీఐ, ఈడీకి కూడా పలువురు ఫిర్యాదు చేశారు' అని జనార్దన్ నాయుడు వివరించారు.

# 41.9 డిగ్రీలు



చిత్తూరులో బోసిపోయిన మురకంబట్టు సర్కిల్

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30: జిల్లావ్యాప్తంగా భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో చాలా మంది ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. దీనివల్ల ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న రెండ్రోజులపాటు ఎండ తీవ్రతతో పాటు వడగాల్పుల ప్రభావం చూపుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం పులిచెర్ల మండలంలో అత్యధికంగా 41.9, రామకుప్పంలో అత్యల్పంగా 36.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా.. నింద్రలో 41.7, ఎస్ఆర్‌పురంలో 41.4, తవణంపల్లె, నగరిలో 41.1, బంగారుపాళ్యం, పలమనేరులో 41, గుడుపల్లెలో 40.6, పుంగనూరులో 40.3, గుడిపాలలో 40, శాంతిపురం, సదుం, వెదురుకుప్పంలో 39.2, సోమల, రొంపిచెర్ల, చౌడేపల్లెలో 39.1, పాలసముద్రంలో 39, పెద్దపంజాణి, జీడీనెల్లూరులో 38.8, పెనుమూరు, కార్వేటినగరంలో 38.7, కుప్పంలో 38.6, చిత్తూరులో 38.5, యాదమరిలో 38, గంగవరంలో 37.6, వి.కోటలో 37.3, విజయపురం, పూతలపట్టులో 37, బైరెడ్డిపల్లె, ఐరాలలో 36.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా నెల్లూరు డీఆర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30: ఉమ్మడి చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ (ఆడిట్, మార్కెట్ వ్యాల్యూ) ఉషారాణి ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈమె స్థానంలో నెల్లూరులో పనిచేస్తున్న హరివర్మ (ఆడిట్, మార్కెట్ వ్యాల్యూ)ను జిల్లాకు ఇన్‌చార్జి డీఆర్‌గా నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద రూ.4.21 లక్షల సీజ్

కార్వేటినగరం, మార్చి 30: కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శనివారం మధ్యాహ్నం చంద్రగిరి నుంచి కారులో వచ్చిన నగల వ్యాపారి పురుషోత్తం ఆచారి నుంచి రూ.4,21,500లను పోలీసులు సీజ్ చేశారు. ఈ నగదుకు ఎలాంటి బిల్లులను చూపకపోవడంతో కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యబాబు తెలిపారు.



# ఓటు నమోదుకు మరో అవకాశం

**ఏప్రిల్ 15వ తేదీవరకు గడువు**

**పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారుల చర్యలు**

చిత్తూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎన్నికల్లో యువ ఓటర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో చాలామంది యువత ఓటర్లుగా నమోదయ్యారు. ఇంకా మిగిలి ఉన్నవారి కోసం ఏప్రిల్ 15వ తేదీవరకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశమిచ్చింది.

### ఓటుకు దూరంగా 2వేల మంది యువత

కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన మార్చి 16వ తేదీనాటికి జిల్లాలో 15,56,247 మంది ఓటర్లున్నారు. వీరిలో 18-19 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 36,083 మంది కాగా, వీరిలో.. 19,766 మంది యువకులు, 16,317 మంది యువతులు ఉన్నారు. వీరంతా వచ్చే ఎన్నికల్లో తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే 18-19 ఏళ్ల వయసున్నవారు ఇంకా సుమారు 2వేల మంది ఓటు నమోదుకు దూరంగా ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.





ముగ్గుల ద్వారా ఓటు నమోదుపై అవగాహన

### స్వీప్ బృందాలతో అవగాహన

జిల్లాలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) బృందాలతో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికి జిల్లా స్థాయిలో కలెక్టర్ షన్మోహన్ ఛైర్మన్‌గా, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ పీడీ తులసి, చిత్తూరు నగరపాలక సంస్థలో కమిషనర్ అరుణ, పట్టణ ప్రాంతాల పరిధిలో మెప్మా పీడీ రాధమ్మ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో 450 స్వీప్ ర్యాలీలు, యువ ఓటర్ల కోసం కాలేజీల్లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ క్యాంపులు, రంగోలి పోటీలు, 2కే రన్, సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, పోస్టర్లు, కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినట్లు అధికారులు చెప్తున్నారు.

### ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం



జిల్లాలో 2019 ఎన్నికల్లో 85.02 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి దీన్ని మరింత పెంచడమే లక్ష్యంగా జిల్లాలో ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నాం. గతంలో తక్కువ పోలింగ్ శాతం నమోదైన కేంద్రాలను గుర్తించి.. అక్కడ ఓటర్ ఫెసిలిటీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీనాటికి 18 ఏళ్లు నిండినవారు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- షన్మోహన్, కలెక్టర్

## బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విశ్వం విద్యార్థుల హవా



సైనిక్ స్కూల్లో ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థినులు

తిరుపతి(విద్య), మార్చి 30: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయని, విశ్వంలో శిక్షణ పొందిన వంశితశ్రీ, మనోజ్ఞబాయి, సోనిక, దర్శిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి సైనిక్ స్కూల్ ప్రవేశం సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక మార్కులు, ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

## కారు ఢీకొని మహిళ దుర్మరణం

పూతలపట్టు, మార్చి 30: కారు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందారు. పూతలపట్టు మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య శెట్టి భార్య చిన్నమ్మ (60) శనివారం రాత్రి బీజీ మిట్టూరు వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞానికి బయల్దేరారు. తమ స్వగ్రామం సమీపంలో రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాహన తనిఖీల్లో రూ.20లక్షల స్వాధీనం

### ఆధారాలు చూపటంతో తిరిగిచ్చేసిన పోలీసులు

చౌడేపల్లె, మార్చి 30: బోయకొండ ఆర్చి వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీలను తన సిబ్బందితో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో రూ.20లక్షలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇండియా-1 ఏటీఎంల్లో నగదు పెట్టడానికి తీసుకెళుతున్నట్లు ఆధారాలను వాహనంలోని వారు చూపారు. ఈ విషయాన్ని ఆర్వోకు చెప్పటంతో ఆయన ఆదేశాలతో తిరిగి వారికి నగదు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి సెంట్రల్, మార్చి 30 : తిరుపతి విద్యుత్ సర్కిల్ (చిత్తూరు జిల్లా) పరిధిలోని వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించే సదుపాయం కల్పించామని సర్కిల్ ఈఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న తమ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పనిచేస్తారని పేర్కొన్నారు.

## 3న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: పద్మావతి యూనివర్సిటీ బీఎడ్, బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఏప్రిల్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎడ్యుకేషన్ విభాగంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ అడ్మిషన్లు చేపడతారు. సమగ్ర వివరాల కోసం 944164594లో సంప్రదించవచ్చునని పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

## 9న తిరుమలలో ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించి, తర్వాత శుద్ధి నిర్వహిస్తారు. 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విశ్వక్సేనుల స్వామికి విశేష సమర్పణ చేస్తారు. 7 నుంచి 9 గంటల వరకు విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం చేస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద అర్చకులు, ఆగమపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

## ఎస్వీయూలో 18 మంది ఉద్యోగులకు మెమోల జారీ

### విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితం

### 3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని వీసీ ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: ఎస్వీ యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి చెందిన 18 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. మార్చి 28వ తేదీ పరీక్షల విభాగంలోని పలు సెక్షన్లను వీసీ శ్రీకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆయా సెక్షన్లకు సంబంధించిన ఎక్కువ మంది అధికారులు, ఉద్యోగులు విధుల్లో లేని విషయాన్ని గుర్తించారు. వారు ఆ సమయంలో ఎందుకు విధులకు హాజరు కాలేదో రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని సూచించారు. వివరణను అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విధి నిర్వహణ సమయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వీసీ సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు సకాలంలో పనులు చేయకుండా ఉద్దేశ పూర్వకంగానే కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పరీక్షల విభాగం పరిధిలోని బీ-9, బీ-5, బీ-6, బీ-4, తదితర విభాగాలను వీసీ తనిఖీ చేసినట్టు తెలుస్తోంది.


గుడిపాల మండలం బసవాపల్లెలోని పంచాయతీ కార్యాలయం - పెనుమూరు మండలం సీఎస్ అగ్రహారం, మొరవకండ్రిగ, గొల్లపల్లెలోని వాటర్ ట్యాంకులు

# వైసీపీ రంగులు మార్చేదెప్పుడు?

గుడిపాల/పెనుమూరు, మార్చి 30: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 14 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు, వాటర్ ట్యాంకులకు వైసీపీ రంగులు మాత్రం మార్చడం లేదని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. గుడిపాల మండలంలోని బసవాపల్లె పంచాయతీ కార్యాలయానికి ముందు భాగంగా తెల్ల రంగు వేసి, వెనుక భాగంలో వైసీపీ రంగులు అలాగే ఉంచేశారు. అలాగే పెనుమూరు మండలంలో చార్వాగానిపల్లి సచివాలయ పరిధిలోని సీఎస్ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకుకు, కలికిరి పంచాయతీ గొల్లపల్లి, మొరవకండ్రిగ పాఠశాల వద్ద కూడా వైసీపీ రంగులతో వాటర్ ట్యాంకులు ఉన్నాయి.

# తిరుమల ఘాట్‌లో ప్రమాదం

### చెట్టును ఢీకొన్న కారు : బెంగళూరు భక్తురాలి మృతి


తిరుపతి బర్డ్ ఆస్పత్రికి మురళీధర్ తరలింపు
భవాని మృతదేహం


ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భక్తురాలు మృతి చెందింది. మరో భక్తుడికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన మురళీధర్, భవాని దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో మూడు కార్లలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.మురళీధర్, భవానీ,వారి ఇద్దరు పిల్లలు ప్రజ్వల్, నిసర,మురళీధర్ అన్న కుమార్తె రక్షితతో కలిసి సాంత్రో కారులో తిరుమల నుంచి బయలుదేరారు. ఏనుగుల ఆర్చి దాటిన తర్వాత కారు అదుపు తప్పి ఎడమవైపున్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. వెనుకవస్తున్న కుటుంబ సభ్యులు, ఇతర ప్రయాణికులు, ప్రమాదానికి గురైన కారులోని మురళీధర్ దంపతులను, పిల్లలను వెలుపలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యులు పరిశీలించి భవాని అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కారు ముందు సీట్లో ఉన్న భవాని తల గట్టిగా డ్యాష్‌బోర్డుకు కొట్టుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు వైద్యులు అభిప్రాయపడ్డారు.పిల్లలు స్వల్పగాయాలతో బయటపడగా, డ్రైవింగ్ చేస్తున్న మురళీధర్ తీవ్రంగా గాయపడ్డారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆస్పత్రికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం మురళీధర్‌ను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

### వెక్కివెక్కి ఏడ్చిన చిన్నారులు

తల్లి మృతదేహం ఒకవైపు, శరీరం మొత్తం రక్తగాయాలై ఎలాంటి కదలికలు లేకుండా పడివున్న తండ్రిని చూసి వారి ఇద్దరు చిన్నారులు వెక్కివెక్కి ఏడ్చారు. 'పైకి లే అమ్మా.. మాట్లాడమ్మా' అంటూ కన్నీరుమున్నీరయ్యారు.దైవదర్శనం కోసం వస్తే ఇలా జరిగిందేంటీ స్వామీ అంటూ కుటుంబ సభ్యులు కూడా రోదించడంతో ఆస్పత్రి ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి.


భవాని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

# సమర్థంగా విధుల నిర్వహణకు వర్క్‌షాప్‌లు అవసరం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు - హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులు


చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30: న్యాయమూర్తులు సమర్థంగా విధులు నిర్వహించేందుకు వర్క్‌షాప్‌లు అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో హైకోర్టు ప్రత్యేక కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులకు సివిల్ సూట్స్- అవలోకనం అంశాలపై ఒక్క రోజు వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇలాంటి వర్క్‌షాప్‌లు నాలుగు విడతలుగా నిర్వహిస్తామని ప్రకటించారు. మాజీ జిల్లా జడ్జిలు జీవీ కృష్ణయ్య, మోహనరావు, రిటైర్డు సివిల్ జడ్జి జేసురత్నకుమార్, తదితరులు న్యాయమూర్తులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, పదో అదనపు జిల్లా కోర్టు జడ్జి అన్వర్‌బాష, పోక్సో కోర్టు జడ్జి శాంతి, ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీదేవి, న్యాయమూర్తులు వెన్నెల, ఉమాదేవి, మాధవి, శ్రీనివాసమూర్తి, షేక్ బాబాజాన్, కీర్తనలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అదనపు సీనియర్, జూనియర్ జడ్జిలు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది.

## త్రిపుర వర్సిటీ వీసీగా నరసింహరాజు

### ఎస్వీయూ రిటైర్డు ఆచార్యుడికి అత్యున్నత పదవి


నరసింహరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: త్రిపురలోని ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎంపీ నరసింహరాజు (డాక్టర్ ముద్దలూరు పెద్ద నరసింహరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సోషియాలజీ హెడ్‌గా, బీఓఎస్ ఛైర్మన్‌గా, ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా, ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో త్రిపురలో గల ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్రిపుర యూనివర్సిటీ వీసీగా నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయన్ను అభినందించారు.

## ఇద్దరు రుయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

### తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫలితం

తిరుపతి (వైద్యం), మార్చి 30 : వైద్యం కోసం వచ్చిన రోగికి హెచ్ఐవీ అంటూ తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు శనివారం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలిగి గాయమైన ఓ యువకుడు పది రోజుల కిందట వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు రుయాస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకున్నాడు. యువకుడికి హెచ్ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్తలు ప్రచురితం కావడంతో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ బి.రాజశేఖర్ నాయక్, ల్యాబ్ అటెండరు ఎన్.రమణ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన మైక్రోబయాలజీ విభాగాధిపతి, డాక్టర్లను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా ల్యాబ్ నుంచి వచ్చే ప్రతి రిపోర్టును ల్యాబ్ విభాగాధిపతి లేదా సంబంధిత డాక్టర్లు పరిశీలించిన తర్వాతనే రోగులకు అందించాలి.

## వైసీపీ ప్రచార సామగ్రి నిల్వపై ఫిర్యాదు

### గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు

రేణిగుంట, మార్చి 30 : వైసీపీ ప్రచార సామగ్రి భారీ ఎత్తున నిల్వ చేసిన మూడు గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు నమోదయ్యింది.రేణిగుంట మండలం పాత విమా నాశ్రయ రోడ్డులోని మూడు గోదాముల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి మూడురోజుల క్రితం బయటపడిన విషయం తెలిసిందే.టీడీపీ నాయకుల ఆందోళనతో ప్రచార సామగ్రిని సీజ్ చేసిన అధికారులు శుక్రవారం కలెక్టర్ అనుమతితో తరలించడానికి అనుమతించారు. కాగా వైసీపీ ప్రచార, ప్రభావిత సామాగ్రిని భద్రపరచిన గోదాముల నిర్వాహకులపై రేణిగుంట ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమి శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రచార సామగ్రిని కొనుగోలు చేసిన సుమన్, గోడౌన్‌లో ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డి, గోదాము ఇన్‌ఛార్జి రవికుమార్‌పై 188వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. అలాగే రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్లో కూడా గోదాముల నిర్వాహకులు సుమన్,ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

## అసలీ ఎమ్మెల్వో ఎవరు?

### వలంటీర్లను రాజీనామా చేయమనడంపై విచారణ

వరదయ్యపాళెం, మార్చి 30:రాజీనామా చేసి వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేయడంపై శనివారం పత్రికల్లో వెలువడిన కథనాలు వరదయ్యపాళెం మండలంలో కలకలం రేపాయి. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరనే విషయంపై చర్చ నడిచింది. పత్రికా కథనాలపై ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారి చిరంజీవి స్పందించి ఆ వలంటీర్లు పనిచేసే సచివాలయ అధికారి బసిరెడ్డికి విచారణ జరపాలని నోటీసు పంపారు.వలంటీర్లను పిలిపించి బసిరెడ్డి వివరణ కోరగా ప్రతి పథకం అమలు చేసే సమయంలో ఎమ్మెల్వో చంద్ర పెట్టే గ్రూప్ మీటింగుల మాదిరిగానే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఫోన్ చేసి డేటా అడగ్గా కొంతమంది స్పందించి వివరాలు చెప్పామన్నారు. ఎప్పుడూ జరిగే కార్యక్రమమే కదా అని స్పందించామంటూ వలంటీర్లు వివరణ ఇచ్చారు. ఈ సమాచారాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయకు,ఎంసీసీ అధికారి చిరంజీవికి కార్యదర్శి బసిరెడ్డి తెలిపారు.వారు ఆ నివేదికను తిరుపతి డీఎల్డీవో, జీఎస్ డబ్ల్యూ కార్యాలయ అధికారులకు పంపించారు. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరు? ఆయన్ను ఎవరు నియమించారు? ఎక్కడ ఉంటారు? తెలుసుకుని కేసు నమోదు చేయిస్తామని చిరంజీవి, అనసూయ తెలిపారు.

## టెన్త్ సంస్కృతం పరీక్షకు 685 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా చివరి రోజైన శనివారం సంస్కృతం పేపర్-2 పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 702 మంది విద్యార్థులకు గాను 685 మంది హాజరవగా, 17 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.

# శివ శివా..

## రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఫిర్యాదులెన్నో

### ప్రభుత్వ భూముల పరాధీనం ● తీవ్ర అవినీతి ఆరోపణలు ● ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ తనిఖీలు

తిరుపతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, శ్రీకాళహస్తి పరిసరాల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం చేయడం.. తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ దృష్టి సారించింది. ఇన్నాళ్లు ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో ఇతడికి ఉన్న దోస్తీ కారణంగా బుట్టదాఖలా అవుతున్నాయని సమాచారం. దీంతో బాధితులు నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లే శనివారం ఆ అధికారితో పాటు బంధువులు, బినామీల ఇళ్లల్లో ఏకకాలంలో తొమ్మిది చోట్ల ఏసీబీ సీఐయూ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన శివప్రసాద్.. స్వల్ప కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఐగా పదోన్నతిపై తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆయన.. ఓ ఆర్డీవో సహకారంతో ప్రొటోకాల్ డీటీగా వ్యవహరించారని తెలిసింది. ఆ సమయంలోనే ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయలో సీనియర్ అసిస్టెంట్‌గా, అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రొటోకాల్ డీటీగా పనిచేశారు. ఆయా సందర్భాలలో ఉన్నతాధికారులతో పెరిగిన పరిచయాలతో రేణిగుంట డీటీగా బదిలీ అయి.. అక్కడే పాతుకుపోయారు. అక్కడ తహసీల్దారును డమ్మీని చేసి డీటీగా ఉన్న శివప్రసాదే అధికారం చెలాయించారన్న విమర్శలున్నాయి. విమానాశ్రయం అనుకుని ఉన్న పాతిక ఎకరాల ప్రభుత్వ భూమికి వైసీపీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఇతరుల పేరిట పట్టాలు జారీ చేశారని.. దాని కోసం ఎకరాకు రూ.20 లక్షల నుంచీ రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ తర్వాత తహసీల్దారుగా పదోన్నతి రావడంతో రేణిగుంటలోనే కొనసాగారు. ఆ సమయంలో రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ బంజరు, పోరంబోకు, అనాధీనం భూములను అనర్హులకు కట్టబెట్టడం, అధికార పార్టీ ముఖ్యనేత కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో చెరువులు, కాలువలకు కూడా ఎన్వోసీలు జారీ కావడం.. ప్రభుత్వ భూముల పరాధీనం, భూముల సెటిల్‌మెంట్లతో అక్రమార్జన వందల కోట్లకు చేరుకుందని సహోద్యోగులే చెబుతున్నారు.

### కలెక్టర్‌కు సరెండర్ చేసినా..!

గతంలో ఇతడిపై వచ్చిన ఆరోపణలపై ఓ కలెక్టర్ విచారణ జరిపించి 40 అంశాలను నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని సమాచారం. ఇటీవల సీసీఎల్ఏ కూడా పలు అంశాల్లో ఇతడిని బాధ్యుడిగా గుర్తించి రేణిగుంట నుంచి కలెక్టర్‌కు సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. తీవ్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లతో ఇతడిని కలెక్టరేట్‌లో కాకుండా ఏర్పేడు మండలానికి బదిలీ చేశారు. అక్రమార్జన.. నేతల అండ చూసుకుని కలెక్టర్లను కూడా ఖాతరు చేసేవారు కాదన్న ప్రచారం ఉంది. ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, చర్యలకు సిఫారసు చేసినా డబ్బు, పలుకుబడితో అధిగమించేవారని చెబుతున్నారు. గతంలోనూ ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో స్నేహం వల్ల తనిఖీలు, దాడులు జరగకుండా జాగ్రత్త వహించేవారని అంటున్నారు. సంబంధిత ఏసీబీ అధికారితో కలసి బెంగళూరు వంటి నగరాల్లో భారీ పెట్టుబడులు కూడా పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

### రంగంలోకి ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్

తాజాగా శివప్రసాద్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఏసీబీకి కాకుండా ఆ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. విజయవాడ నుంచే మొత్తం 42 మందితో కూడిన బృందాలు ఏకకాలంలో దాడులు జరిగాయి. కాగా, తనకు స్నేహమున్న ఏసీబీ అధికారి సూచన మేరకు మొత్తం అక్రమార్జనంతా బినామీల పేరిట పెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికే గుర్తించిన పలువురు బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లను తనిఖీ చేయనున్నట్టు సమాచారం.

ఇంతకాలం అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఇతడిని వెనకేసుకొచ్చి, అన్నింటికీ అండదండలిచ్చిన క్రమంలో ఈ దాడులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. బహుశా, శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన నేతకు తెలియకుండా విలువైన భూముల విషయంలో ఎవరికైనా సహకరించి భారీగా లబ్ధి పొంది ఉంటారని, ఉంటారని, అది ఆలస్యంగా తెలియడం వల్లే ఆ నేతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ చర్యలకు కారకులై ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. గతంలో పలువురు అధికారులను వేధించిన చరిత్ర ఆ నేతకు ఉండటంతో దీన్ని కొట్టిపారేయలేమంటున్నారు. కారణాలేవైనా ఎప్పుడో జరగాల్సిన ఏసీబీ తనిఖీలు, చర్యలు ఆలస్యంగానైనా మొదలు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బంగారుపాళ్యంలో ఏసీబీ తనిఖీలు


బంగారుపాళ్యం మండలం గుర్రంకొండ్లవూరులోని తహసీల్దారు శివప్రసాద్ మామ నాగులయ్య ఇంట్లో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పలు రికార్డులు, బ్యాంకు పుస్తకాలు, భూ రికార్డులను పరిశీలించారు. బ్యాంకు పుస్తకాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం.

- బంగారుపాళ్యం

## క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



విజేతలతో బీసీ నాగరాజ్ తదితరులు

కుప్పం, మార్చి 30: క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ అన్నారు. కేఈసీలో వారం రోజులుగా జరుగుతున్న క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడల్లో పాల్గొనడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఫుట్‌బాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, కబడ్డీ, రన్నింగ్ రేసు క్రీడల్లో విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, సీఈవో ఎస్.సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.బాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సతీశ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల కవాతు



రామకుప్పం, మార్చి 30: మండలంలోని ఓటర్లకు భరోసా కల్పించేందుకు శనివారం కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్సు సాయుధ బలగం, స్థానిక పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు సమస్యాత్మక గ్రామాలైన 89పెద్దూరు, ననియాల, ముద్దనపల్లెల్లో ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో వారు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి తాము అన్నివిధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## 4 నుంచి ఎన్నికల ప్రచారం

పుంగనూరు రూరల్, మార్చి30: ఏప్రిల్ 4తేదీ నుంచి పుంగనూరు మండల పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు, అక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్‌కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## యువతకు అండగా టీడీపీ



తెలుగు యువత సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

రామకుప్పం, మార్చి 30: రాష్ట్రంలో యువతకు అండగా నిలిచేది టీడీపీయేనని తెలుగు యువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. శనివారం మండల పరిధి వీర్నమల, వీర్నమలపెద్దతాండా, చిక్కపల్లెతాండా, గుట్టూరుతాండా, బల్ల, విజలాపురంలలో తెలుగు యువత సమావేశాల్లో వారు మాట్లాడుతూ సీఎం జగన్ యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. వైసీపీ అసమర్థ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరవయ్యాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోభృతి అందిస్తామన్నారు. ఈ విషయాలన్నింటినీ తెలుగుయువత సభ్యులు గ్రామాల్లో యువతకు వివరించి, రానున్న ఎన్నికల్లో వారంతా కూడా చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచేలా కృషి చేయాలని వారు కోరారు. ఆయా సమావేశాల్లో నేతలు శ్రీనివాసులురెడ్డి, కుమార్, భూపతి, జేయి, రాజకుమార్‌నాయక్, మునీంద్రనాయక్, శివాజీనాయక్, శంకర్, శ్రీనివాసులు, హనుమంతు, పరశురాం, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ

బంగారుపాళ్యం, మార్చి 30: మంగళపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం మంగళ విద్యావాణి 26వ సంచికను ఎంఈవో నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగార్థం విద్యార్థులచే నిర్వహిస్తున్న ఏకైక మాస పత్రిక మంగళ విద్యావాణి అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు మంగళ విద్యావాణి సంచికను తయారు చేసి జిల్లాకే కాకుండా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గణిత అవధాని అరుణశివప్రసాద్, సంజీవి, భారతి, పిల్లారప్ప, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యువతకు టీ షర్టుల పంపిణీ

పుంగనూరు రూరల్ : ఏప్రిల్ 2, 3 తేదీల్లో పుంగనూరులో జరిగే సుగుటూరు గంగమ్మ జాతరలో వలంటీర్లుగా పని చేసే యువతకు దాత భానుప్రకాష్‌నాయక్ టీ షర్టులను శనివారం పంపిణీ చేశారు. ఆలయం వద్ద పనిచేసే వలంటీర్లకు ఏడేళ్లుగా టీ షర్టులు ఇస్తున్నామన్నారు.

# ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా వేళలు

ఎండుతున్న పంటలు





బీటలు వారిన వరి, ఎండిన ముల్లంగి పంటలో పశువులను వదిలిన రైతులు

పెద్దపంజాణి, మార్చి30: వేళాపాళాలేని విద్యుత్ సరఫరా కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. 9గంటల సరఫరాకు అనుగుణంగా రైతులు పంటలు సాగుచేశారు. రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా 2గంటలు కుదించి 7గంటలు మాత్రం సరఫరా చేస్తున్నారు. అదీ పగలు 4గంటలు, రాత్రి 3గంటలు ఇస్తామని చెబుతారు. అలా సరఫరా చేసే విద్యుత్ సైతం గంటకు 10 మార్లుపైగా అంతరాయం అంటూ కట్ చేస్తున్నారు. ఇదేంటని అడిగితే సమాధానం చెప్పే వారేలేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు పంట చేతికందే సమయంలో వరిపంటకు సరిపడా నీరందివ్వక పోవడంతో వరి మళ్ళు బీటలు వారుతున్నాయి. ఆరుతడి పంటలుగా సాగు చేసిన టమోట, ముల్లంగి, వంకాయ, మిరప మొదలైన పంటలు ఎండుతున్నాయి. ఓ వైపు పెరుగుతున్న ఎండలు, మరోవైపు అడుగంటిన చెరువులు, కుంటల కారణంగా రైతులు పూర్తి స్థాయిలో బోరుబావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వేళాపాళా లేని విద్యుత్ సరఫరా కారణంగా పంటలు అర్ధంతరంగా ఎండిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయానికి విద్యుత్ సకాలంలో పంపిణీకి చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

## కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు



కల్లూరు, మార్చి 30: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లెలో యాభై ఏళ్ల క్రితం నాటిన విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. స్తంభాల అడుగు భాగంలో ఇనుప కమ్మీలు బయటపడటంతో తుప్పు పట్టాయి. చిన్నపాటి గాలికి సైతం స్తంభాలు అటుఇటు ఊగుతున్నాయి. వర్షాలు, ఈదురుగాలులు వచ్చే సమయంలో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలు కూలుతాయోమనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.



# టీడీపీతోనే బీసీలకు మంచి భవిష్యత్తు



కుప్పంలో జరిగిన బీసీ సెల్ సమావేశం

కుప్పం, మార్చి 30: బీసీల భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడివుందని నియోజకవర్గ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు జేఎంసీ మురళి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ బీసీ సెల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 5న జయహో బీసీ, బీసీ డిక్లరేషన్ అవగాహన సమావేశం నిర్వహించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో బీసీల కోసం టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలో, ఎలా ప్రచారం చేసి, ఎన్నికల్లో బీసీలను టీడీపీవైపు ఆకర్షించాలో చర్చ జరుగుతుందన్నారు. బీసీలందరూ టీడీపీవైపే ఉన్నా, వారి ఆదరణను ఓట్లుగా మలచుకోవడానికి అవసరమైన ప్రణాళిక రచన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జీఎం.రాజు, టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, గుడుపల్లె మండల అధ్యక్షుడు బాబు, శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, వైద్యం శాంతారాం, నియోజకవర్గ బీసీ సెల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు పాల్గొన్నారు.

## బైపరెడ్లపల్లెలో శంఖారావం

రామకుప్పం, మార్చి 30: మండల పరిధి బైపరెడ్లపల్లెలో శనివారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ గత ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గతంలో అమలు చేసిన అన్ని రైతు సంక్షేమ పథకాలను పునరుద్ధరించడమే కాకుండా, ప్రతి రైతుకు ఏటా రూ.25000 ఆర్థికసాయం అందిస్తుందన్నారు. దీనిని గమనించి ప్రతి రైతు కుటుంబం రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి, కుప్పం నియోజకవర్గం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి, మండల అధ్యక్షుడు కొళ్ళపల్లె బాబు, మాజీ అధ్యక్షుడు నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మద్యం పట్టివేత : ఇద్దరి అరెస్టు

రామకుప్పం, మార్చి 30: రామకుప్పం మండలం రాజుపేట వద్ద శుక్రవారం రాత్రి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు ... ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి రాధాకృష్ణ, ఎస్‌ఐ శివకుమార్‌లు శుక్రవారం రాత్రి 11:30 గంటలకు రాజుపేట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్ వైపు నుంచి రామకుప్పం పట్టణం మోడల్‌కాలనీకి చెందిన అన్నదమ్ములైన హరినాయక్, రవినాయక్‌లు ద్విచక్రవాహనంలో ఓ సంచిని తీసుకుని వస్తుండగా అధికారులు వారిని ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.44వేలు విలువ చేసే 1056 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల మద్యం ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటక మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మద్యం, నిందితులతో ఎస్‌ఐ శివకుమార్ తదితరులు

## వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, మార్చి30: ఓ మహిళ అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జానకీరామ్ తెలిపారు. ఆయన కథనం మేరకు .... పుంగనూరు పట్టణంలోని మేలుపట్లకు చెందిన రమేశ్‌కు అదే ప్రాంతానికి చెందిన భారతి(37)తో వివాహం జరిగింది. అయితే శుక్రవారం సాయంత్రం గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాకపోడంతో భర్త రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, మార్చి30: వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఆయన కథనం మేరకు .... వనమలదిన్నె పంచాయతీ బసినేపల్లెకు చెందిన బి.రమ్య(22)కు పుంగనూరు పట్టణం తాటిమాకులపాళ్యంకు చెందిన అంజప్ప కుమారుడు పురుషోత్తంతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కలరు. అయితే కొంత కాలంగా భర్త పురుషోత్తం, అత్త లీలావతి, గాయిత్రిలు వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నల్లగుండరాయ స్వామి సేవలో మాజీ మంత్రి అమర్

బైరెడ్డిపల్లె, మార్చి 30 : కడపనత్తంలో ఉన్న నల్లగుండరాయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన పుష్పపల్లకి సేవలో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఆయనను సత్కరించి స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.

## వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం

రొంపిచెర్ల, మార్చి 30: వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిందని పుంగనూరు టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.సహదేవ అన్నారు. శనివారం ఆయన రొంపిచెర్లలో మాట్లాడుతూ దళితులు ప్రభుత్వ అక్రమాల ను ప్రశ్నిస్తే వారిపై కేసులు బనాయిస్తున్నారన్నారు. దళితులకు తిరిగి న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కోరారు. సమావేశంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, నరేష్, బూత్ కన్వీనర్ యాదవనాయుడు, చిరంజీవి, శంకర, బాలాజీ, నందకుమార్ పాల్గొన్నారు.

## డెయిరీ కార్మికుల దీక్ష

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ చిత్తూరు విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష శనివారానికి 200వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు కుమార్, ఎబినేజర్ మాట్లాడుతూ తమకు వేతన బకాయిలు చెల్లించడంలో తమకు న్యాయం చేస్తామని ఇటు ప్రభుత్వం, అటు జిల్లా కలెక్టర్ చెప్పి నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి విజయా డెయిరీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

## టెంపో ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

సోమల, మార్చి 30: సోమల-తిరుపతి రోడ్డు మార్గంలోని అభయాంజనేయ ఆలయం వద్ద రోడ్డు దాటుతున్న బాలుడిని టెంపో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరుకు చెందిన టెంపో లగేజీతో తిరుపతి వైపు పోతుండగా అభయాంజనేయ ఆలయం వద్ద వాచ్‌మెన్ రామచంద్ర కుమారుడు కిరణ్(9)ను ఢీకొంది. తీవ్రగాయాలైన బాలుడిని తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు.

## నిత్యావసర వస్తువుల పంపిణీ



సోమల, మార్చి 30: నంజంపేట పంచాయతీ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు 11 రకాల నిత్యావసర సరుకులను మైనార్టీ యూత్ సభ్యులు అందజేశారు. గత మూడేళ్లుగా యూత్ సభ్యులు 5కేజీల బియ్యం, కంది పప్పు, చక్కర, నూనె, తదితర సరుకులు 35 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఖయ్యూం, లాలూ, అక్బర్, చాను, ఇంతులూ, అస్లాం, సద్దాం, ఇర్ఫాన్, రిజ్వాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు చేయండి

సోమల, మార్చి 30: ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే ప్రజలు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు నని పుంగనూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందే అనుమతులు పొందాలన్నారు. టెలివిజన్, కేబుల్‌నెట్ వర్కు, డిజిటల్ డిస్‌ప్లేలు ప్రచార అనుమతి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవా లని తెలిపారు. ఎన్నికలు సజావుగా నడవడానికి ప్రతి ఒక్కరూ సహకరించా లన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజ, డీటీలు శ్యాంప్రసాద్‌రెడ్డి, రామూర్తి, ఆర్‌ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఏనుగుల దాడితో ఆవు మృతి

సోమల, మార్చి 30: మండలంలోని అన్నెమ్మగారిపల్లె సమీప పొలం వద్ద పశువుల పాకపై ఏనుగుల గుంపు స్వైర విహారం చేయడంతో ఆవు మృతి చెందింది. శుక్రవారం రాత్రి అన్నెమ్మగారిపల్లెకు చెందిన వెంకట్రమణ పశువులను పొలం వద్ద పాకలో కట్టేసి ఇంటికి వెళ్లారు. ఏనుగుల గుంపు ఆ పాక వద్ద బీభత్సం సృష్టించాయి. ఏనుగుల ఘీంకారంతో పాకలోని పలు పశువులు పొలాల వైపు పరుగులు పెట్టాయి. అక్కడే ఉన్న మరో ఆవుపై ఏనుగులు దాడి చేయడంతో మృత్యువాత పడింది. శనివారం ఉదయం వెంకట్రమణ కుటుంబసభ్యులు ఏనుగుల రాక గుర్తించారు. పశువైద్య సిబ్బంది ఆవుకు పొలం వద్దనే పోస్టుమార్టం నిర్వహించారు.

## తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు సర్వీసులు

పలమనేరు, మార్చి30 : తిరువణ్ణామలై కొండ చుట్టేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలమనేరు డిపోనుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. ఏప్రిల్ 23వ తేది పౌర్ణమి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు, 13 గంటలకు రెండు బస్సులు తిరువణ్ణామలైకు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సులు తిరువణ్ణామలైకు అదేరోజు సాయంత్రం 5 గంటలకు, 6గంటలకు చేరుకుంటాయని తెలిపారు. తిరిగి మరుసటి రోజు తెల్లవారుజామున 2గంటలకు, 3గంటలకు బయలు దేరి ఉదయం 6 గంటలకు, 7 గంటలకు పలమనేరుకు చేరుకుంటాయని తెలిపారు. ఒక్కొక్కరికి తిరువణ్ణామలైకు వెళ్లిరాను బస్సుచార్జి రూ. 520గా నిర్ణయించామని తెలిపారు. ఈఅవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ అన్నదానం



కుప్పం, మార్చి 30: టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుప్పంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నపుడు పేదల కడుపు నింపడానికి నాటి సీఎం చంద్రబాబు పెట్టిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిందని విమర్శించారు. కార్యక్రమంలో వైద్యం శాంతారాం, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



పలమనేరు, మార్చి30 : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈనెల 31వ తేది ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటరమణను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఆర్‌ఓ రవిరెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మాజీ కమిషనర్ విజయసింహారెడ్డి, తాలూకా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు ఆనందబాబు, జిల్లా ఎన్జీఓ సంఘ ఉపాధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

బైరెడ్డిపల్లె, మార్చి 30 : బైరెడ్డిపల్లె నుంచి కుప్పం వెళ్లే ప్రధాన రహదారిలో కైగల్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో మండలంలోని తూర్పుగడ్డ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం(65) గాయపడ్డారు. వి.కోట వైపు నుంచి సుబ్రమణ్యం ద్విచక్రవాహనంలో వస్తుండగా కైగల్ వద్ద ఆగివున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది తమ వాహనంలో బాధితుడిని చికిత్సకోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

## పౌష్టికాహారం వితరణ

రామకుప్పం, మార్చి 30: మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు విజయవాడ కోహెన్స్ ఫార్మాసూటికల్స్ కంపెనీ వారు పౌష్టికాహార ప్యాకెట్లను వితరణగా ఇచ్చారు. శుక్రవారం రామకుప్పం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వాటిని వైద్యాధికారి దీప ఏడుగురు వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. 4కిలోల చొప్పున వేరుశనగ గింజలు, పెసరపప్పు, కందిపప్పు, 2కిలోల బుడ్డశెనిగలు, కిలో బెల్లం, 2 లీటర్ల వంటనూనె పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ మస్తాన్ బాషా, టీబీ సూపర్‌వైజర్ హరి పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



కల్లూరు, మార్చి30: పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీనర సింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వ హించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించా రు. వివిధ పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా వంకాయలపాటివారిపల్లెకు చెందిన వెంకటముని నాయుడు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

## ప్రత్యేక అలంకరణలో శనేశ్వరస్వామి



పుంగనూరు రూరల్; మార్చి30: పుంగనూరు సమీపంలోని పుంగమ్మ చెరువు మొరవ, దండుపాళ్యం మార్గంలో వెలసిన శనేశ్వరస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు ఉపవాసాలతో స్వామిని దర్శించుకున్నారు.

## మరమ్మతుకు నోచుకోని నీటిశుద్ధి యంత్రం



సోమల, మార్చి 30: పట్టణంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద గత 10 రోజులుగా నీటి శుద్ధి యంత్రం మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో మంచి నీరు అందక పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధియంత్రం కొద్ది రోజులుగా పనిచేయకపోవడంతో దిడ్డివారిపల్లె, వడ్డిపల్లె, చెన్నయ్యగారిపల్లె, బీసీ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు గురైన యంత్రాలను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## టీడీపీలో చేరిక

రొంపిచెర్ల, మార్చి 30:చెంచెమరెడ్డిగారిపల్లె పంచాయతీ మూరేవాండ్లపల్లెకు చెందిన తమ్మిశెట్టి సత్యం కుటుంబం చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో శనివారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో చెంగల్‌రెడ్డి, సమదేవ, రఘు తదితరులు ఉన్నారు.

## సేవ చేయడానికి వచ్చాం... ఆశీర్వదించండి


నంగమంగళం న్యూ కాలనీలో ప్రచారం చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, మార్చి 30: సంపాదించడానికి రాలేదని, సేవ చేయడం కోసమే వచ్చామని, తమను ఆశీర్వదించాలని గురజాల చెన్నకేశవులు నాయుడు, గురజాల ప్రతిమ అన్నారు. శనివారం సియోన్‌మలై చర్చి ఆవరణలో టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని నంగమంగళం, పానాటూరు, గొల్లమడుగు పంచాయతీల్లో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు గెలుపు కోసం వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పటికే జీజేఎం ట్రస్టు ద్వారా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వారు పేర్కొన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి, మాజీ ఎంపీపీ దీపశ్రీ, మహిళా అధ్యక్షురాలు ఉదయ, పద్మావతి, నాయకులు జయచంద్ర, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి

నగరి, మార్చి 30: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, నగరి ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. నగరి ఆర్డీవో కార్యాలయంలో శనివారం జరిగిన అన్ని రాజకీయపార్టీల నాయకుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయపార్టీల నేతలు సమావేశాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు వేయాలన్నా, ప్రచారం చెయ్యాలన్నా అనుమతి తప్పని సరిగా ఉండాలన్నారు. నగరి నియోజకవర్గంలో 229 పోలింగు కేంద్రాలున్నాయని, పుత్తూరులో 1500 ఓట్లకు పైగా వున్న 52, 68 బూత్‌లలో అదనంగా ఒక్కో బూత్ ఏర్పాటు చేయాల్సి ఉండటంతో నగరి నియోజకవర్గంలో 231 పోలింగ్ కేంద్రాలుంటాయన్నారు. వడమాలపేటలో 31, పుత్తూరులో 64, నగరిలో 80, నిండ్రలో 25, విజయపురంలో 29 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గడువు ముగియడంతో ఫారమ్-7, 8 దరఖాస్తులు స్వీకరించడం జరగదన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌కు పదవీ విరమణ సన్మానం


అమరేంద్రబాబును సన్మానిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30: రెవెన్యూశాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ అమరేంద్రబాబు సేవలు అమూల్యమైనవని డీఆర్వో పుల్లయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అమరేంద్రబాబు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి డీఆర్వో ముఖ్య అతిథిగా విచ్చేసి అమరేంద్రబాబును శాలువా కప్పి మెమెంటోను బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరన్, సూపరింటెండెంట్లు గుణశేఖర్‌రెడ్డి, సుశీల, జిల్లా రెవెన్యూ సంఘ నేతలు హుస్సేన్, పార్థసారథి, హేమాద్రి రాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అమరేంద్రబాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పదవీ విరమణ చేసిన హెచ్‌ఎంకు సన్మానం


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

విజయపురం, మార్చి 30: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ సేవలు ప్రశంసనీయమని ఎంఈవో ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. సోమశేఖర్ విద్యాశాఖలో 36 సంవత్సరాల పాటు చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయన్ను పూలమాల దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత జ్యోతిలక్ష్మి, రిటైర్డు ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, రైటైర్డు ఎంఈవోలు యుగంధర్‌రాజు, జయదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువతరమే ఓటుకు వారధులు


ప్రైవేటు ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ చిన్నయ్య

చిత్తూరు, మార్చి 30: యువతరమే ఓటుకు బలమైన వారధులని నగరపాలక నోడల్ అధికారుల బృందం నగరంలోని క్రియ ప్రైవేటు లిమిటెడ్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ టీము శనివారం క్రియ ప్రైవేటు కంపెనీ లిమిటెడ్ ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగం, ఈవీఎంల పనితీరు, నైతిక ఓటు హక్కు అంశాలపై అవగాహన కల్పించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యువతరం తప్పనిసరిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు కోసం యువతరం మంచి నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


అతిథులతో దేవీ స్కూల్ ఉపాధ్యాయులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: విద్యతోనే విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, విశ్రాంత అధ్యాపకులు హరి నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక గిరింపేటలో దేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 41వ వార్షికోత్సవం కరస్పాండెంట్ ఎన్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తేజోమూర్తి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టులో ముమ్మర తనిఖీలు

గుడిపాల, మార్చి 30: సాధారణ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువులు జిల్లాకు రాకుండా అడ్డుకోవడం కోసం గుడిపాల చెక్‌పోస్టులో అధికారులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన గొల్లమడుగు, సియోన్‌మలై చర్చి వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎత్తిరాజులు, తనిఖీ అధికారి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళ పత్రాన్ని అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), మార్చి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన వాసవి రూ.1,01,116 శనివారం విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను ఆలయ వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి

చిత్తూరు, మార్చి 30: సీసీ కెమెరా అమర్చిన తీరుపై రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంలో ఒక మహిళపై దాడి జరిగింది. రెండో పట్టణ సీఐ ఉలసయ్య కథనం మేరకు గంగనపల్లె సమీపంలో బీఎంఆర్ గేటెడ్ కమ్యూనిటీలోని కింది అంతస్థు, పై అంతస్థుల్లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యుల మధ్య సీసీ కెమెరా అమర్చిన తీరుపై వివాదం జరిగింది. ఈ సందర్భంగా పై అంతస్థులో ఉన్న నిరంజన్‌రెడ్డి, ఆయన భార్య పద్మావతమ్మలు కలిసి కింది అంతస్థులో ఉన్న భానుప్రియ, ఆమె ఇద్దరి పిల్లలపై దాడి చేసి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యానును ఢీకొన్న కారు

### - ముగ్గురికి స్వల్ప గాయాలు


నుజ్జునుజ్జు అయిన కారు

పూతలపట్టు, మార్చి 30: ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ చిన్నారితో పాటు మరో ఇద్దరు స్వల్పంగా గాయ పడ్డారు. మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శనివారం వేకువజామున ముందు వెళుతున్న పాల వ్యానును ఓ కారు వెనుక వైపు ఢీకొనడంతో తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన ఏడు సంవత్సరాల ఓ చిన్నారితో పాటు మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న పంటపల్లె గ్రామస్తులు

పూతలపట్టు, మార్చి 30: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో శనివారం బెంగళూరుకు చెందిన కామేశ్వరచౌదరి భోజన వితరణ చేశారు. సురేంద్రబాబు, పరంధామ నాయుడు, సురేష్, మహేష్‌కుమార్, ఏకాంబరం, పంటపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, మార్చి 30: గుడిపాలలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, దాతలు ముట్టుకూరుపల్లెకు చెందిన సాంబశివ నాయుడు, పవన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నేతలు రవి నాయుడు, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బకాసుర వధ

చిత్తూరు కల్చరల్, మార్చి 30: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్యకండ్రిగ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో గత మూడు రోజులుగా మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బకాసుర వధ (బండి ఉత్సవం) ఘట్టానికి గాను నిర్వాహకులు ఎద్దుల బండ్లను కట్టి పరిసర గ్రామాల్లో ఊరేగింపుగా బకాసురుడికి ముష్టాన్నం కోసం బిక్షాటన నిర్వహించనున్నారు.

## కేంద్ర సాయుధ బలగాలతో కవాతు



శ్రీరంగరాజపురం, మార్చి 30: మండలంలోని 49.కొత్తపల్లి మిట్ట, తయ్యూరు గ్రామాల్లో శనివారం ఎస్ఐ కుళాయిప్ప ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాల కవాతు జరిగింది. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటును నిర్భయంగా వేయాలని ఎస్ఐ కోరారు.

**గుడిపాల:** ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అసాంఘిక శక్తులకు హెచ్చరికలు చేయడం కోసం పోలీసులు కవాతు నిర్వహించారు. వెస్ట్ సీఐ రవిశంకర్, ఎస్ఐ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు శనివారం 197 రామాపురం, కొత్తపల్లె గ్రామాల్లోని వీధుల్లో కవాతు నిర్వహించారు.

## 200వ రోజుకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ చిత్తూరు విజయా డెయిరీ కార్మికులు స్థానిక కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష శనివారానికి 200వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు కుమార్, ఎబినేజర్ మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించడంలో తమకు న్యాయం చేస్తామని ఇటు ప్రభుత్వం, అటు జిల్లా కలెక్టర్ చెప్పి నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సరైన ఉద్యోగాలు లేక ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు అనారోగ్యంపాలై తమలో కొంత మంది చనిపోయారని, వారి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విజయా డెయిరీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో సుబ్రమణ్యం, భాస్కర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న విజయా డెయిరీ కార్మికులు

## కూటమిని గెలిపించండి.. చిత్తూరును అభివృద్ధి చేస్తా

- గురజాల జగన్మోహన్ హామీ


వికలాంగుడు గోపాల్‌ను సత్కరిస్తున్న గురజాల, నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 30: కూటమిని గెలిపిస్తే చిత్తూరును అభివృద్ధి చేస్తానని చిత్తూరు రూరల్ మండల ప్రజలకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు, అనంతాపురం గ్రామ పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతాపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఒక్క యూనివర్సిటీ కూడా లేక విద్యార్థులు బయట జిల్లాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చిత్తూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తాళంబేడు పంచాయతీ కొండిరెడ్డిపల్లిలో పొలంలో గానుగాడుతున్న రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే 9 గంటల ఉచిత విద్యుత్‌ను తప్పనిసరిగా ఇచ్చేలా కృషిచేస్తానని గురజాల హామి ఇచ్చారు. కాసేపు సరదాగా బెల్లం తయారు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, జిల్లా నాయకులు కాజూరు బాలాజీ, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, రాజా, హరిబాబు, దయారాం, సురేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ● కాగా చిత్తూరు రూరల్ మండలం తెల్లగుండ్లవలస గ్రామానికి చెందిన వికలాంగుడు గోపాల్ మూడు చక్రాల సైకిల్‌లో మధ్యాహ్నం ఎండలో కూడా ప్రచారంలో పాల్గొన్నాడు. గోపాల్ ఉత్సాహాన్ని గమనించిన గురజాల జగన్మోహన్ అతడిని శాలువా కప్పి సత్కరించారు.

## పూడిక తీయని మురుగు కాలువలు

### - దుర్గంధంతో ప్రజలకు ఇబ్బందులు


శ్రీబొమ్మరాజుపురం ఆది ఆంధ్రవాడలో దుర్గంధం వెదజల్లుతున్న కాలువ

పాలసముద్రం, మార్చి 30: మండలంలోని పాలసముద్రం పంచాయతీ శ్రీబొమ్మరాజుపుర ఆది ఆంధ్రవాడలో ఉన్న మురుగు కాలువలు చెత్త చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాలువ పక్కనే గ్రామానికి తాగునీటి సరఫరా చేసే బోరు సైతం ఉంది. గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివాసముంటున్నాయి. గత మూడు నెలలుగా మురుగు కాలువలను శుభ్రపరచకపోవడంతో మురుగునీరు పొంగిపొర్లుతోంది. ఈ మార్గంలో వెళ్లాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. మురుగు కాలువలను శుభ్రం చేయాల్సిన పంచాయతీ సర్పంచ్, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల బెడద విపరీతంగా ఉంది. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించి దుర్గంధం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణులు హరి

చిత్తూరు రూరల్, మార్చి 30: ధ్యానం, ప్రాణాయామంతో ఒత్తిడిని అధిగమించవచ్చునని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు హరి విద్యార్థులకు సూచించారు. శనివారం మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో విద్యార్థులు విజయ సాధనలో ఒత్తిడిని అధిగమించడం ఎలా అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచంలో వస్తున్న పోటీని తట్టుకోవడానికి విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. దానిని అధిగమించాలంటే హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలన్నారు. అంటే సబ్జెక్టును బట్టీతో కాకుండా అర్థం చేసుకొని చదివితే ఒత్తిడికి గురికామని ఆయన తెలిపారు. ప్రతిరోజు యోగా, ధ్యానం, ప్రాణాయామం తప్పకుండా చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అపోలో వైస్‌చాన్సలర్ వినోద్, రిజిస్ట్రార్ పోతురాజు, అధ్యాపకులు, డాక్టర్లు భాస్కర్ నాయుడు, హసీనా, మహేంద్రనాథ్ చౌదరి, సుధా, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పన్నులపై వడ్డీమాఫీకి నేటితో ఆఖరు

చిత్తూరు, మార్చి 30: చిత్తూరు నగరపాలక సంస్థ 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీమాఫీకి ఆదివారం ఆఖరు రోజు అని, ఈ అవకాశాన్ని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. ఆదివారం పురసేవా కేంద్రం పనిచేస్తుందని, వార్డు సచివాలయాల్లోనూ పన్ను చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని నగరప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆదరించి ఎంపీగా గెలిపించండి


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

శ్రీరంగరాజపురం, మార్చి 30: తనను ఆదరించి చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శనివారం పుల్లూరు క్రాస్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గం ఇన్‌చార్జి రాజేంద్రన్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. ఎంపీ అయితే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం వస్తుందని చెప్పారు. తన గెలుపుకోసం అందరూ సహకరించాలని కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి కోటకొండ విశ్వనాథం, పార్లమెంటు ఇన్‌చార్జి రెడ్డిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ, జిల్లా జనరల్ సెక్రటరీలు రమేష్ నాయుడు, వెంకటముని, జిల్లా కార్యదర్శి జి.కె. చౌదరి, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యువరాజ్, ఆరుమండల బీజేపీ అధ్యక్షులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

చిత్తూరు కల్చరల్, మార్చి 30: గుడ్ ఫ్రైడే మరుసటి రోజు శనివారం నగరంలోని క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించి, క్రీస్తు బోధనలను ప్రజలకు వివరించారు. నగరంలోని క్రైస్తవ సంఘాలు, చర్చిల నిర్వాహకులు కొంగారెడ్డిపల్లె షర్మన్ బాలికోన్నత పాఠశాల నుంచి శనివారం చిత్తూరు గాంధీసెంటర్ వరకు క్రీస్తు బోధనలు ఆలపిస్తూ తిరిగి షర్మన్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జె. ఇమ్మాన్యువేల్ జ్ఞాన సియోన్, రెవరెండ్ మరియప్ప, శామ్యూల్‌బాబు, విశ్రాంత డీఎస్పీ అమర్నాద్ పెడరిక్, ఆర్. జోబ్, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 30: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ చెప్పారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఎన్నికలముందు ఇచ్చిన హామీని అమలుచేయడంలో మాటతప్పారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు సుముఖంగా ఉన్నట్లు చెప్పారన్నారు. ఈనెల 30న గుంటూరులో మాదిగల విశ్వరూపసభకు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, తిరస్కరించడం బాధాకరమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మాదిగల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి గ్రామస్థాయిలో మాదిగల సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ నేతలు రాజ్‌కుమార్, అనిల్ కుమార్, మురళి, వెంకటాచలం, నరసింహులు పాల్గొన్నారు.

## గతేడాది స్పాట్ బకాయిలు చెల్లించాలి: ఫ్యాప్టో


డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి గతేడాది చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఫ్యాప్టో నాయకులు శనివారం స్థానిక స్పాట్ కేంద్రంలో డీఈవో దేవరాజుకు వినతిపత్రం అందించారు. గతేడాది స్పాట్ బకాయిలు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అందజేయలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. స్పాట్‌కు ఆదివారం రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారని, టీఏ, డీఏపై స్పష్టత ఇవ్వాలని డీఈవోను కోరారు. రంజాన్ మాసం దృష్ట్యా ముస్లీం టీచర్లకు స్పాట్ నుంచి వెసులుబాటు, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునాఫ్, రమణ, కోశాధికారి గోపినాథ్, మునీర్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డిపల్లి వాసి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30: ఎస్ఆర్‌పురం మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన ఈదల రవి (55) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. యూనివర్సిటీ పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. రవి పుత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య గీత, కుమారుడు బెంగళూరులో ఉంటున్నారు. మద్యానికి బానిసై కొంత అప్పులు చేశాడు. జీవితంపై విరక్తి చెంది ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని రక్షణ దళం విశ్రాంత కార్యాలయం ఎదుట చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుడి భార్యకు, అలిపిరి స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న అక్క మునిలక్ష్మికి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని డిప్యూటీ సీఎం మోసం చేశారు

### - మేనల్లుడు రమేష్ బాబు ఆరోపణ


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 30: రానున్న ఎన్నికల్లో తనకు వైసీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాటిచ్చి, ఆఖరి నిముషంలో మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ నేత, డిప్యూటీ సీఎం మేనల్లుడు రమేష్ బాబు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పదవిని అడ్డుపెట్టుకుని తన కుమార్తె కృపాలక్ష్మికి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించుకున్నారని ఆయన విమర్శించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను డిప్యూటీ సీఎంకు స్వయానా మేనల్లుడినని, వైసీపీలో ఆయన వెంట ఎన్నోఏళ్ళు పనిచేశానని చెప్పారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వల్ల నియోజకవర్గంలో ఏ ఒక్క దళితుడికి కూడా న్యాయం జరగలేదని చెప్పారు. కృపాలక్ష్మి స్థానికులకు ఎప్పుడూ అందుబాటులో ఉండరని, ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ అధిష్ఠానం తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. లేకుంటే కృపాలక్ష్మిని ఓడిస్తామని ఆయన హెచ్చరించారు.

## మాజీ సర్పంచ్ చిన్నిపై చర్యలు తీసుకోండి

- ఇందిరమ్మ కాలనీ బాధితుల నిరసన


గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

చిత్తూరు రూరల్, మార్చి 30: తమకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటుంటే అడ్డుకుంటున్న మురకంబట్టు మాజీ సర్పంచ్ చిన్ని, అతడి అనుచరుడు మధుపై చర్యలు తీసుకోవాలని మురకంబట్టులోని ఇందిరమ్మ కాలనీ బాధితులు అధికారులను కోరారు. శనివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో తమ స్తోమతకు తగ్గట్టుగా ఇళ్లు నిర్మించుకుంటే చిన్ని, అతడి అనుచరులు మధు, లత వచ్చి పనిముట్లను రోడ్డుపై పారవేసి అసభ్యకరంగా దూషించి దాడి చేశారని ఆరోపించారు. మహిళలని కూడా చూడకుండా గూండాలతో వచ్చి బెదిరిస్తున్నాడని, కులం పేరుతో దూషిస్తున్నాడని ఆరోపించారు. చిన్ని, అతడి అనుచరులపై కేసు నమోదు చేసి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. బాధితులు సుమతి, కుమార్, జయలక్ష్మి, సరితా, రాజా, పవిత్ర, జయంతి, సర్వాణ, కన్నమ్మ, క్రిష్ణవేణి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

## మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ

బంగారుపాళ్యం, మార్చి 30: మంగళపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం మంగళ విద్యావాణి 26వ సంచికను ఎంఈవో నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగార్థం విద్యార్థులచే నిర్వహిస్తున్న ఏకైక మాస పత్రిక మంగళ విద్యావాణి అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు మంగళ విద్యావాణి సంచికను తయారు చేసి జిల్లాకే కాకుండా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గణిత అవధాని అరుణశివప్రసాద్, సంజీవి, భారతి, పిల్లారప్ప, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఈవో